క్లుప్తంగా

సంఘం అభివృద్ధికి ఎంపీ నిధులు మంజూరు

బిచ్కుంద(జుక్కల్): మండలంలోని వాజిద్ నగర్ మున్నూర్ కాపు సంఘం అభివృద్ధికి, బిచ్కుందలో హైమాస్ట్ లైటింగ్ కోసం జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్ నిధులు మంజూరు చేశారని మాజీ జెడ్పీటీసీ కమల్ కిశోర్, మాజీ ఎంపీటీసీ మొగులయ్య అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మున్సిపాలిటీ ఎదురుగా చౌరస్తాలో హైమాస్ట్ లైటింగ్, మున్నూర్ కాపు సంఘం అభివృద్ధికి నిధులు కేటాయించాలని ఎంపీని కోరిన వెంటనే స్పందించి లైటింగ్ కోసం రూ.6 లక్షలు, వాజిద్‌నగర్ మున్నూర్ కాపు సంఘానికి రూ.5 లక్షలు నిధులు ఇచ్చారని తెలిపారు. త్వరలోనే పనులు ప్రారంభిస్తామన్నారు. ఎంపీ షెట్కార్‌కు కృతజ్ఞతలు తెలిజేశారు. బిచ్కుంద సంఘం అధ్యక్షుడు పుల్లెన్ విఠల్, మాజీ ఎంపీటీసీ సురేష్ పాల్గొన్నారు.

అందుబాటులో నానో యూరియా

నిజాంసాగర్(జుక్కల్): మండలంలోని అచ్చంపేట సొసైటీ గోదాంలో నానో యూరియా అందుబాటులో ఉందని సొసైటీ సీఈవో సంగమేశ్వర్‌గౌడ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎకరానికి లీటర్ నానో యూరియా వాడాలన్నారు. లీటర్‌కు రూ.220 చొప్పున విక్రయిస్తున్నామన్నారు. యూరియా అవసరం ఉన్న రైతులు సొసైటీలో సంప్రదించాలని కోరారు.

సాయిమిత్ర సిండికేట్ సభ్యుల రక్తదానం



కామారెడ్డి అర్బన్: స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి రోగుల కోసం ఆదివారం కల్కి భగవతి భగవాన్ ఆలయం, ఐవీఎఫ్, కామారెడ్డి రక్తదాతల సమూహం, రెడ్‌క్రాస్ సొసైటీల సంయుక్త ఆధ్వర్యంలో రక్తదానం శిబిరం నిర్వహించగా.. సాయిమిత్ర సిండికేట్ సభ్యులు 24 మంది రక్తదానం చేశారు. దాతలకు ప్రశంసాపత్రాలు అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో ఐవీఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్ బాలు, జిల్లా అధ్యక్షుడు ఎర్రం చంద్రశేఖర్, రక్తదాతల సమూహం అధ్యక్షుడు జమీల్ హైమద్, ప్రతినిధులు వేదప్రకాష్, గంప ప్రసాద్, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

పండ్ల మొక్కలను నాటుకోవాలి

ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డి మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు పండ్ల మొక్కలను నాటుకోవాలని ఎంపీడీవో ప్రకాష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని గ్రామాలకు సంబంధించి నర్సరీలలో పండ్ల మొక్కలు అందుబాటులో ఉన్నాయని, మొక్కలను నాటుకునేందుకు స్థలం ఉన్న వారు తప్పకుండా మొక్కలను తీసుకుని నాటాలని అన్నారు.

సత్యసాయి గ్రామోత్సవం



కామారెడ్డి అర్బన్: సత్యసాయి బాబా శత జయంతిలో భాగంగా సత్యసాయి సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం పట్టణ పరిధిలోని సరంపల్లిలో గ్రామోత్సవం నిర్వహించారు. సరంపల్లి పాఠశాల విద్యార్థులకు క్రీడలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ముగ్గురు గర్భిణులకు సీమంతాలు చేశారు. ఆధ్యాత్మిక భజనలతో ఊరేగింపు నిర్వహించి ఇంటింటికి సత్యసాయి ఫొటో, ప్రసాదం, విభూతి అందజేశారు. సత్యసాయి సేవా సంస్థ జిల్లా ప్రతినిధులు వెంకటేష్, లింబాద్రి, భాస్కరశర్మ, కేవీ అశోక్ కుమార్, శ్రీనివాస్, స్వప్న, ఉమ, మాధవి తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ



లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రం సమీపం సమీపంలోని నల్లమడుగు చౌరస్తా వద్ద ఆదివారం ఎస్సై దీపక్ కుమార్ సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వాహనాల ధ్రువపత్రాలు, లైసెన్సులు లేనివారికి హెల్మెట్, సీటు బెల్టు పెట్టుకోని వారికి, మద్యం తాగి వాహనాలు నడుపున్న పలువురికి జరిమానాలు విధించారు. పెండింగ్ చలానాలు రూ.10,670 వసూలు చేశారు. మద్య తాగి వాహనం నడిపితే కేసు నమోదు చేస్తామని ఎస్సై హెచ్చరించారు.

ఉచితంగా వినాయక విగ్రహాల పంపిణీ

భిక్కనూరు: మండల కేంద్రంలోని గాంధీచౌక్ వద్ద సోమవారం(25న) ఉదయం 10 గంటలకు భారతీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచితంగా మట్టి వినాయక విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు ఫౌండేషన్ అధ్యక్షుడు లింగాల రాజబాబుగౌడ్ ఆదివారం తెలిపారు. ప్రజలు ఈ కార్యక్రమానికి తరలివచ్చి మట్టి గణపతులను తీసుకెళ్లాలని ఆయన కోరారు.

వైర్లు కట్ చేయాల్సిందే..!

- విద్యుత్ స్తంభాలకు ఉన్న కేబుల్ వైర్లు తొలగిస్తున్న ట్రాన్స్‌కో సిబ్బంది
- క్రమ పద్ధతిలో అమర్చుకోవడంలో ఆపరేటర్లు విఫలం



బాన్సువాడలో కేబుల్ వైర్లను తొలగిస్తున్న విద్యుత్ సిబ్బంది

బాన్సువాడ: విద్యుత్ స్తంభాలకు అస్తవ్యస్తంగా ఏర్పాటు చేస్తున్న కేబుల్ వైర్లతో నిత్యం ప్రమాదాలు జరుగుతుండటంతో ప్రభుత్వం, విద్యుత్ శాఖ అధికారులు తీవ్రంగా స్పందించారు. కేబుల్ వైర్లను విద్యుత్ స్తంభాలకు క్రమ పద్ధతిలో అమర్చుకోవాలని విద్యుత్ శాఖ చెబుతున్నా ఇప్పటి వరకు పెడచెవిన పెట్టిన కేబుల్ ఆపరేటర్లకు ఆ శాఖ షాక్ ఇచ్చింది. ఇటీవల హైదరాబాద్‌లో కేబుల్ వైర్ల వల్ల షార్ట్ సర్క్యూట్ జరిగి ఐదుగురు చనిపోవడంతో ప్రభుత్వం తీవ్రంగా స్పందించింది. ఈ క్రమంలో మున్సిపాలిటీలో స్తంభాలకు వేలాడదీసిన కేబుల్ వైర్లను ముందస్తు సమాచారం ఇవ్వకుండా తొలగించాలని ఉన్నతాధికారులు ఆదేశాలు ఇవ్వడంతో స్థానిక సిబ్బంది రెండు, మూడు రోజులుగా కేబుల్ వైర్లను కత్తిరిస్తున్నారు.

అవగాహన లోపంతోనే తిప్పలు

మున్సిపాలిటీలో కేబుల్ కనెక్షన్లతో పాటు ఇంటర్నెట్ కేబుల్స్‌ను విద్యుత్ స్తంభాలకు వేలాడదీస్తుంటారు. పదుల సంఖ్యలో ఉన్న ఆపరేటర్లు ఇష్టారీతిన వీటిని స్తంభాలకు వేలాడదీస్తుండడంతో సమస్య వచ్చినప్పుడు స్తంభం ఎక్కడానికి తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతుందని విద్యుత్ సిబ్బంది చెబుతున్నా ఆపరేటర్లు పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి. దీనికి తోడు తక్కువ ఎత్తులో తీగలను వేలాడదీస్తుండడంతో భారీ వాహనాలు తగిలి తరుచూ తెగిపడడం, కిందకు జారడంతో ద్విచక్ర వాహనదారులు, పాదచారులు ప్రమాదాలకు గురవుతున్నారు. కట్టలుగా కేబుల్ వైర్లను స్తంభాలకు కడుతుండడంతో షార్ట్ సర్క్యూట్స్ సర్వసాధారణంగా మారాయి.

కట్ చేస్తే ఇబ్బందే..

విద్యుత్ శాఖ అధికారులు యుద్ధ ప్రాతిపదికన కేబుల్ వైర్లను కట్ చేస్తే ప్రజలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతాయని పలువురు అంటున్నారు. సాధారణ టీవీ కేబుల్స్‌తో పాటు ఇంటర్‌నెట్ కేబుల్స్ కూడా విద్యుత్ స్తంభాలకు ఉన్నాయి. వీటిని కట్ చేస్తే పలువురికి ఇంటర్నెట్ సౌకర్యం లేకుండా పోతుంది. వర్క్ ఫ్రం హోం ద్వారా పని చేసే ఐటీ ఉద్యోగులతో పాటు విద్యార్థులు కూడా ఇబ్బంది పడే అవకాశం ఉంది. దీనిని దృష్టిలో పెట్టుకొని విద్యుత్ శాఖ అధికారులు ముందస్తుగా ఆపరేటర్లతో సమావేశం ఏర్పాటు చేసి అస్తవ్యస్తంగా ఉన్న కేబుల్ వైర్లను సరిచేసుకోవడానికి అవకాశం ఇవ్వాలని పలువురు కోరుతున్నారు.

రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలి



భిక్కనూరులో వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న బీవీఎం నేతలు



తాడ్వాయిలో..

భిక్కనూరు/తాడ్వాయి: రాష్ట్రీయ మూల్ నివాసి బామ్‌సేఫ్ రాష్ట్ర స్థాయి 12వ మహాసభలను కామారెడ్డిలో ఈనెల 31న నిర్వహిస్తున్నట్లు భారతీయ విద్యార్థి మోర్చ రాష్ట్ర కన్వీనర్ భూంపల్లి రవితేజ, కార్యదర్శి విఠల్‌లు తెలిపారు. ఆదివారం భిక్కనూరు మండలం తిప్పాపూర్‌లో, తాడ్వాయి మండల కేంద్రంలో ఈ మహాసభలకు సంబంధించిన వాల్‌పోస్టర్లు, కరపత్రాలను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఓబీసీ కుల జనగణనను జరపాలని, ఈవీఎం మిషన్లను తొలగించాలని , నూతన విద్యా విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. బామ్‌సెఫ్ సంఘం బహుజన సమాజాన్ని చైతన్యం చేస్తూ పూలే, అంబేడ్కర్ సిద్ధాంతాలను ప్రచారం చేస్తుందన్నారు. ఈ మహాసభలకు ఎస్సీ ఎస్టీ, బీసీ, మైనార్టీలు అధిక సంఖ్యలో తరలి రావాలని వారు కోరారు. భిక్కనూరులో భారతీయ యువ మోర్చా జిల్లా కన్వీనర్, ప్రభాకర్, భారత్ ముక్తి మోర్చా జిల్లా కన్వీనర్ గడ్డం రవి, భారతీయ విద్యార్థి మోర్చ జిల్లా కన్వీనర్ యశ్వంత్, నేతలు గణేష్, సురేష్, ప్రవీణ్, కిరణ్‌లు, తాడ్వాయిలో నేతలు గడ్డం రవి, లింగం, రోహిత్, నర్సింలు, అరుణ్, శ్రీధర్, స్వామి, సందీప్, భరత్, చరణ్ పాల్గొన్నారు.

రైతుల సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించాలి



మాట్లాడుతున్న బీకేఎస్ మండల అధ్యక్షుడు మర్రి గోపాల్ రెడ్డి

రాజంపేట: రైతుల సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని భారతీయ కిసాన్ సంఘ్(బీకేఎస్) జిల్లా అధ్యక్షుడు పైడి విఠల్ రెడ్డి అన్నారు. బస్వన్నపల్లిలోని రెడ్డి సంఘ భవనంలో మర్రి గోపాల్ రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన మండల శిక్షణ తరగతులకు ఆయన హాజరై మాట్లాడారు. గ్రామ కమిటీల సమావేశాలు వారం వారం తప్పకుండా జరపాలని గ్రామ కమిటీలోని సమస్యలన్నీ పరిష్కారమయ్యే విధంగా కార్యకర్తలందరూ చైతన్యవంతులు కావాలన్నారు.రైతుల హక్కులు,విధులు తెలుసుకొని సంబంధిత అధికారులతో ఎప్పటికప్పుడు సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. పార్టీలు వేరైనా రైతులంతా ఒక్కటేనేనని పార్టీలకతీతంగా కులమత వర్గాలకతీతంగా రైతు సమస్యల కోసం పోరాడాలన్నారు. జిల్లా కార్యదర్శి ఆర్ల శంకర్రావు, జిల్లా ఉపాధ్యక్షుడు సాయిరెడ్డి, జిల్లా విత్తన ప్రముఖ్ బైరవ రెడ్డి, జిల్లా యువ ప్రముఖ్ మనోహర్ రెడ్డి, మండల కార్యదర్శి కృష్ణారెడ్డి, మండల కమిటీ మెంబర్లు, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో గుర్తింపు లేదు



మేనూర్‌లో మాజీ ఎమ్మెల్యే సమక్షంలో పార్టీలో చేరిన నాయకులు

మాజీ ఎమ్మెల్యే హన్మంత్ సింధే

మద్నూర్(జుక్కల్):కాంగ్రెస్ పార్టీలో నేతలకు గుర్తింపు లేదని, అందుకే ఆ పార్టీని వీడి పలువురు బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారని మాజీ ఎమ్మెల్యే హన్మంత్ సింధే అన్నారు. మేనూర్‌లో ఆదివారం మద్నూర్, అంతాపూర్ గ్రామాలకు చెందిన పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మాజీ ఎమ్మెల్యే సమక్షంలో గులాబీ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా సింధే మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చకపోవడంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని విమర్శించారు. తప్పుడు హామీలతో కాంగ్రెస్ పార్టీ గద్దెనెక్కిందని ఆరోపించారు. సంక్షేమ ఫలాలు అందని ద్రాక్షగానే మిగులుతున్నాయన్నారు. రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని సింధే జోస్యం చెప్పారు. పార్టీ అధ్యక్షుడు బస్సీపటేల్, విండో మాజీ చైర్మన్ పాకాల విజయ్, మాజీ సర్పంచ్ సురేశ్, సీనియర్ నాయకులు కంచిన్ హన్మండ్లు, నర్సింలుగౌడ్, గోవింద్, పాంచాల్ గోపి, రవి, గఫార్ తదితరులున్నారు.

కరాటే పోటీల్లో కామారెడ్డి జిల్లా క్రీడాకారుల ప్రతిభ



కామారెడ్డి అర్బన్: హైదరాబాద్‌లోని కోట్ల విజయ భాస్కర్‌రెడ్డి ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన కరాటే పోటీల్లో జిల్లా క్రీడాకారులు 16 మంది పాల్గొని ప్రతిభ చూపి బంగారు, వెండి పతకాలు సాధించినట్లు కరాటే మాస్టర్ సూర్య తెలిపారు. బ్రూస్‌లీస్ జీత్ కూనే దూ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఇంటర్‌నేషనల్ ఓపెన్ టూ స్పోర్ట్స్ ఆల్ స్టైల్స్ కరాటే, కుంగ్ ఫూ, తైక్వాండో, మార్షల్ ఆర్ట్స్ ఛాంపియన్‌షిప్ నిర్వహించింది. మాస్టర్ సూర్యతో పాటు శ్రీనివాస్, అర్జున్, గుడుగు బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

గణేష్ ఉత్సవాలు శాంతియుతంగా జరుపుకోవాలి



బీబీపేట: గణేష్ ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలని ఎస్సై ప్రభాకర్ అన్నారు. ఆదివారం మండలంలోని స్థానిక పోలీసు స్టేషన్‌లో గణేష్ మండపాల నిర్వాహకులు, యూత్ సభ్యులతో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి మండపం వద్ద విద్యుత్‌కు తగిన చర్యలు తీసుకోవాలని, మండపాలకు వచ్చే మహిళా భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని తెలిపారు. అంతే కాకుండా ఎలాంటి ఘర్షణలు చోటు చేసుకోకుండా చూసుకోవాలని సూచించారు. ఏఎస్సై, మధు, సిబ్బంది పాల్గొన్నారు.

భారీ వినాయక విగ్రహాల ఏర్పాటు



రామారెడ్డి: మండల కేంద్రంలో ప్రతి ఏటా వినాయక మండపాల ఏర్పాట్లు ప్రత్యేకంగా నిర్వహిస్తారు. ఈ ఏడాది కూడా భారీ వినాయక విగ్రహాలను రామారెడ్డి గ్రామానికి తరలిస్తున్నారు. ఆదివారం హిందూదళ్ యూత్ ఆధ్వర్యంలో 19 ఫీట్ల భారీ వినాయకుడిని తెప్పించారు. రామారెడ్డిలో గత ఏడాది 96 విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఈ ఏడాది కూడా వివిధ యువజన సంఘాల ఆధ్వర్యంలో భారీ విగ్రహాలను ఆవిష్కరించేందుకు ఏర్పాటు చేసుకుంటున్నారు. కోరుట్ల నుంచి భారీ విగ్రహాలను తెప్పిస్తున్నారు. పోలీసులు, విద్యుత్‌శాఖ సిబ్బంది విద్యుత్ వైర్లుతో భారీ విగ్రహాలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

ఆధ్యాత్మికం

భక్తి శ్రద్ధలతో శివాలయంలో భజనలు



లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని ప్రభుస్వామి శివాలయంలో ఆదివారం భక్తి శ్రద్ధలతో భక్తులు భజనలు చేశారు. అంతకు ముందు నగర సంకీర్తన చేసి గ్రామంలో ప్రధాన ఆలయాల్లో టెంకాయలు కొట్టారు.ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేసి భక్తి పాటలు ఆలపించారు. అనంతరం గ్రామస్తులకు, భక్తులకు నిర్వాహకులు అన్నదానం చేశారు.

ధ్యానంతో మనశ్శాంతి

తాడ్వాయి(ఎల్లారెడ్డి): ధ్యానం చేయడం వల్ల మనశ్శాంతి, /జ్ఞానం కలుగుతుందని బ్రహ్మర్షి సుభాష్ పత్రీజీ అన్నారు. తాడ్వాయి మండల కేంద్రంలోని శబరిమాత ఆశ్రమంలో ఆదివారం పిరమిడ్ వర్చువల్ సొసైటీ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో ధ్యానం, ఆత్మ/జ్ఞాన సందేశ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. జిల్లా అధ్యక్షుడు నిమ్మ భూంరెడ్డి, ప్రొఫెసర్ పాండురంగం, ఆర్గనైజర్ గంగారెడ్డి, శోభారాణి, సంజీవులు, రాజేందర్‌రావు, పోశెట్టిలతో పాటు వివిధ గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.

బీడీకాలనీ అంజనేయస్వామి గర్భాలయ పనులు

కామారెడ్డి అర్బన్: పట్టణ పరిధిలోని దేవునిపల్లి బీడీ వర్కర్స్ కాలనీలోని అంజనేయ స్వామి గర్భాలయ నిర్మాణ పనులను ఆదివారం ప్రారంభించారు. వేదపండితులు జి.అంజనేయశర్మ విశేష పూజలు నిర్వహించారు. బీఆర్‌ఎస్ నాయకుడు కాసర్ల స్వామి, కాలనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

నేడు మండల సమాఖ్య సమావేశం

తాడ్వాయి(ఎల్లారెడ్డి): స్థానిక ఐకేపీ కార్యాలయంలో ఈ నెల 25న మండల సమాఖ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఐకేపీ ఏపీఎం రాజు తెలిపారు. ఉదయం 10 గంటలకు మండల సమాఖ్య అధ్యక్షురాలు అధ్యక్షతన ఈ సమావేశం ప్రారంభమవుతుందని వెల్లడించారు. వివిధ శాఖల అధికారులు, సిబ్బంది అందరూ సకాలంలో హాజరు కావాలని కోరారు.

రోడ్డు పక్కనే పరిశ్రమ వ్యర్థాలు



తాడ్కోల్ శివారులో రోడ్డు పక్కన వేసిన రైస్‌మిల్ వ్యర్థాలు

బాన్సువాడ రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో పారిశ్రామిక వ్యర్థాలను రోడ్ల పక్కనే పారేస్తున్నారు. రసాయనాలు కలిసిన అపరిశుభ్రమైన నీటిని పంట కాలువల్లోకి వదిలేస్తున్నారు. అయినా అధికారులు తమకేమి పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. బాన్సువాడ పట్టణానికి నలుదిక్కులా రైస్‌మిల్లులు వెలిశాయి. వాటి నుంచి విడుదలవుతున్న వ్యర్థాలను డంపింగ్‌యార్డులకు తరలించకుండా యథేచ్ఛగా మిల్లు పక్కనే, రోడ్లకు ఆనుకుని గుంతలు తీసిమరి డంప్ చేస్తున్నారు. దీంతో రోడ్డు పక్కనుంచి వెళ్లే వారికి దుర్వాసన తప్పడం లేదు. పంట కాలువల్లో మురికినీటిని వదిలేస్తుండటంతో పంటల దిగుబడి తగ్గుతోందని రైతులు వాపోతున్నారు. మిల్లుల నుంచి విడుదల అయ్యే ఊక సైతం రోడ్డువెంబడి పోయే వాహనచోదకుల కళ్లలో పడుతోంది. అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ప్రమాదకరంగా లెండి వంతెన



సైడ్ వాల్స్ కూలిపోయిన లెండి వంతెన

మద్నూర్(జుక్కల్): మండలంలోని గోజేగావ్ వెళ్లే రహదారిలో లెండి వాగుపై గల వంతెన ప్రమాదకరంగా మారింది. వాగుపై నిర్మించిన లోలెవల్ వంతెనకు సైడ్‌వాల్స్ కూలిపోవడంతో ప్రమాదకరంగా తయారైందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వంతెనకు సైడ్‌వాల్స్ లేక వాహనాలు అదుపు తప్పి వాగులో పడుతున్నాయని అధికారులు స్పందించి వంతెనకు సైడ్‌వాల్ నిర్మించాలని వాహనదారులు కోరుతున్నారు.

శిథిలమైన క్వార్టర్స్ కూల్చివేత

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): నాగిరెడ్డిపేట పోలీస్‌స్టేషన్ ఆవరణలో శిథిలావస్థకు చేరిన క్వార్టర్స్ కూల్చివేత పనులు ఆదివారం నుంచి ప్రారంభమయ్యాయి. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శిథిలావస్థకు చేరిన క్వార్టర్స్ భవనాలను ప్రొక్లెయిన్ సహాయంతో కూల్చివేశారు. పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఉన్న శిథిలావస్థ క్వార్టర్స్ భవనాలు పాములకు, ఇతర విష పురుగులకు స్థావరంగా మారాయి. ఎట్టకేలకు క్వార్టర్స్ కూల్చివేత పనులు చేపట్టడంతో పాముల బెడద సమస్య తీరనుంది.



నూతన కార్యవర్గాల ఎన్నిక..

పవర్ డిప్లొమా ఇంజినీర్ల అసోసియేషన్ కార్యవర్గం



కామారెడ్డి అర్బన్: పవర్ డిప్లొమా ఇంజినీర్స్ అసోసియేషన్(2025–27) ఎన్నికలు ఆదివారం నిర్వహించారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా సీహెచ్ మల్లేష్ , కార్యదర్శిగా వి.ప్రదీప్‌కుమార్, కోశాధికారిగా సీహెచ్ శ్రీనివాస్ ఎన్నికయ్యారు. కార్య నిర్వహణ కార్యదర్శిగా ఎస్.దేవీప్రసాద్, కార్యాలయ కార్యదర్శిగా సీహెచ్ ప్రభాకర్, మహిళా ప్రతినిధిగా కె.స్వప్న, కామారెడ్డి డివిజన్ కార్యదర్శిగా నాందేవ్, డివిజన్ కోశాధికారిగా నవీన్, బాన్సువాడ, ఎల్లారెడ్డి డివిజన్ల కార్యదర్శిగా సంతోష్, కోశాధికారిగా ప్రశాంత్, సెంట్రల్ డివిజన్ కార్యదర్శిగా పి.హన్మంత్‌రెడ్డి, కోశాధికారి బి.మహేష్, జిల్లా సలహాదారులుగా బి.రఘుకుమార్ ఎన్నికయ్యారు.

కోటిలింగేశ్వర కల్కినగర్ కార్యవర్గం ఎన్నిక



కామారెడ్డి అర్బన్: పట్టణ పరిధిలోని కోటిలింగేశ్వర కల్కినగర్ నాలుగవ వీధి సంఘం ఎన్నికలు ఆదివారం నిర్వహించారు. అధ్యక్షుడిగా బట్టు విఠల్ ముదిరాజ్, ఉపాధ్యక్షుడిగా సతీష్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా సామిరెడ్డి, సహాయ కార్యదర్శిగా నర్సింలు, కోశాధికారిగా నారాయణరావు, కార్యవర్గసభ్యులుగా చంద్రం ముదిరాజ్, సురేందర్‌రెడ్డి, కాషాగౌడ్, సంజీవరెడ్డి, అంజనేయులు, సమన్వయకర్తగా రాజేందర్, రాజులు ఎన్నికయ్యారు.

మానవ హక్కుల కౌన్సిల్ మండల అధ్యక్షుడిగా రమేశ్



లింగంపేట: మానవ హక్కుల కౌన్సిల్ లింగంపేట మండల అధ్యక్షుడిగా నేనావత్ రమేశ్ ఎన్నికయ్యారు. శనివారం హైదరాబాదులోని ఉస్మానియా ఆడిటోరియంలో తెలంగాణ స్టేట్ ఇండియన్ నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రమేశ్‌ను అధ్యక్షుడిగా నియమించినట్లు తెలిపారు. తెలంగాణ అధ్యక్షుడు నవోదయ సిద్ధు, ఎస్సీ, ఎస్టీ చైర్మన్ బక్కి వెంకటయ్య, కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు బోరంచ సాయిలు, తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజ్ సంఘం అధ్యక్షుడిగా రాజు



బాన్సువాడ: బాన్సువాడ పట్టణ ముదిరాజ్ సంఘం అధ్యక్షుడిగా కనుకుట్ల రాజును ఆదివారం సంఘ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా సంగమేశ్వర్, వర్ని అంజయ్య, ప్రధాన కార్యదర్శిగా గాంధారి సాయిలు, సహాయ కార్యదర్శిగా పోల్కం రాజు,కోశాధికారిగా నాటకారి రాజేష్, డైరెక్టర్లుగా బర్ల నాగయ్య, గంగారం, పోల్కం రాంబాబు,హన్మండ్లు, రెంజర్ల హన్మండ్లు, పాతర్ల లాలయ్య సలహాదారులుగా కొంకి విఠల్, దావుగారి దాకయ్య, చందూరి నారాయణ, చందూరి గంగారం, బోలబోయిన శేఖర్‌లను ఎన్నుకున్నారు. అధ్యక్షుడు మాట్లాడుతూ.. ముదిరాజ్ సంఘం అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని అన్నారు. సంఘం సభ్యులు గురువినయ్, గడుమల లింగం, చీదరి సాయిలు, సోనంగారి హన్మాండ్లు ఉన్నారు.

సమాచారం

నేడు ఓం శాంతి కేంద్రంలో రక్తదానం

కామారెడ్డి అర్బన్: స్థానిక పంచముఖి హన్‌మాన్‌కాలనీలోని ప్రజాపిత బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ఓం శాంతి కామారెడ్డి కేంద్రంలో సోమవారం ఉదయం 9 గంటల నుంచి ఒంటి గంట వరకు రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి జయదీదీ తెలిపారు. ఈ శిబిరానికి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి, కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్‌లు హాజరు కానున్నట్లు ఆమె తెలిపారు.

28లోగా దరఖాస్తులు చేసుకోవాలి

ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డి పట్టణంలోని అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్(ఏటీసీ)లో అడ్మిషన్ల కోసం పదవ తరగతి ఉత్తీర్ణులైన వారు ఈ నెల 28లోగా దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ రూపానాయక్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంజనీరింగ్ డిజైన్,ఎలక్ట్రిక్ మెకానిక్‌తో పాటుమరో నాలుగు కోర్సులలో చేరేందుకు దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

బసవేశ్వర ఆలయంలో అన్నదాన కార్యక్రమం

బాన్సువాడ రూరల్: బోర్లం గ్రామ ఆది బసవేశ్వర ఆలయంలో ప్రతి సోమవారం అన్నదానం చేయడానికి నిర్ణయించినట్లు అన్నదాన కమిటీ ప్రతినిధులు దిగంబర్, సంగమేశ్వర్, సుభాష్‌లు తెలిపారు. కార్యక్రమాన్ని సోమవారం ఆలయ పీఠాధిపతి సద్గురు సోమలింగ శివాచార్య ఆధ్వర్యంలో ప్రారంభించనున్నట్లు తెలిపారు. అన్నదాన వితరణ కార్యక్రమానికి బాన్సువాడ పరిసర ప్రాంత భక్తులు, ప్రజలు అధిక సంఖ్యలో హాజరై తీర్థప్రసాదాలు స్వీకరించాలన్నారు.

వ్యవసాయ యాంత్రీకరణ పథకానికి దరఖాస్తుల ఆహ్వానం

బాన్సువాడ రూరల్/దోమకొండ: తెలంగాణ ప్రభుత్వం పునఃప్రారంభించిన వ్యవసాయ యాంత్రీకరణ పథకం కోసం ఆసక్తి గల రైతులు దరఖాస్తు చేసుకోవాలని బోర్లం క్లస్టర్ ఏఈవో రాణి , దోమకొండ ఏవో మణి దీపిక తెలిపారు. బాన్సువాడ మండలంలో 160 బ్యాటరీ పంపులు, 24 తైవాన్ పంపులు, 10 రోటవేటర్లు, 2 సీడ్ ఫర్టిలైజర్ డ్రిల్, 11 చొప్పున కల్టివేటర్లు, డిస్క్‌హ్యారో, ఎండీప్లవ్, రోటోపడ్లర్, కేజీవీల్స్ అందుబాటులో ఉన్నాయన్నారు. అలాగే ఒక్కోటి చొప్పున పవర్ వీడర్, బండ్ ఫర్మర్, 2 బ్రష్ కట్టర్, 4 పవర్ టిల్లర్లు, 12 గడ్డి కట్టలు కట్టే యంత్రం తదితర పరికరాలు అందుబాటులో ఉన్నాయన్నారు. అలాగే దోమకొండలో కూడా తగినన్ని అందుబాటులో ఉన్నాయని వెల్లడించారు. ఎస్సీ, ఎస్టీ రైతులకు 50శాతం ఇతర రైతులకు 40శాతం సబ్సిడీపై అందించనున్నామని తెలిపారు. యాంత్రీకరణ పథకంలో ఇప్పటి వరకు లబ్ధిపొందని రైతులకు మొదటి ప్రాధాన్యత ఇస్తామన్నారు. ఆధార్‌కార్డు, పాస్‌బుక్, ఫోటోలతో వచ్చి దరఖాస్తు చేసుకోవాలన్నారు.

విద్యార్థి పోరుయాత్రను జయప్రదం చేయాలి



కామారెడ్డి టౌన్: పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో ఈనెల 25 నుంచి 30 వరకు చేపడుతున్న తెలంగాణ విద్యార్థి పోరు యాత్రను జయప్రదం చేయాలని జిల్లా అధ్యక్షుడు సురేష్ తెలిపారు. ఆదివారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని యాత్ర చేపడుతున్నామన్నారు. విద్యాహక్కు, ఫీజుల నియంత్రణ చట్టాలను అమలు చేయాలన్నారు. ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల దోపిడీని అరికట్టాలని డిమాండ్ చేశారు.